టెట్ నుంచి మినహాయించాలని నిరసన

నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -పాడేరు : ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుండి మినహాయింపు ఇవ్వాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సుప్రీంకోర్టులో వెంటనే రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం యుటిఎఫ్ ఆధ్వర్యంలో పాడేరులో నిరసన చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ కు వినతిపత్రం అందజేశారు పాం ర్లమెంటులో ఆర్‌టిఇ యాక్ట్ సెక్షన్ 23(1)ను సవరణ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని, రెండవ శనివారం, ఆదివారాల్లో ఉపాధ్యాయులకు ప్రత్యేక తరగతులు నిర్వహించ వద్దని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్ అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్షులు వి.మహేశ్, సహాధ్యక్షులు టి.చిట్టిబాబు, జిల్లా కార్యదర్శులు యం.ధర్మా రావు, పి.దేముడు, యస్.కన్నయ్య, వివిధ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

బినామీలమయం

- గిరిజనుల పేరుతో గిరిజనేతరుల పెత్తనం
- యథేచ్ఛగా రిసార్ట్స్, టెంట్లు ఏర్పాటు
- అధికారుల నిర్వాకంతో నష్టపోతున్న మన్యవాసులు
- బోసుబెడలో బావి కప్పేసి రిసార్ట్స్ నిర్మాణం

బోసుపేట గ్రామ సమీపంలో బినామీ పేరుతో నిర్మిస్తున్న రిసార్ట్స్

ప్రజాశక్తి- అరకులోయ : పర్యటక కేంద్రమైన అరకులోయ బినామీలకు నెలవుగా మారిపోయింది. ఎక్కడ చూసినా బినామీలే రాజ్యమేలుతూ, రిసార్ట్స్, టెంట్లు నిర్వహిస్తున్నారు. నిజమైన గిరిజనుల పేరుతో వారి ఉపాధికే గండి కొడుతున్నారు.

స్థానిక గిరిజన యువతకు పర్యాటక సీజన్లో ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రాంతంలో పర్యాటకులకు విడిదికి టెంట్లను నిర్వహించి ఉపాధి అవకాశాలను పొందాలని పాడేరు ఐటిడిఎ అవకాశం కల్పించింది. గిరిజనులకు ప్రయోజనం, లబ్ధి చేకూర్చేందుకు అధికారులు అనుమతి ఇవ్వడం ఆనందదాయకమైనప్పటికీ, దీన్ని అడ్డం పెట్టుకొని మైదాన ప్రాంతం నుంచి గిరిజనేతరులు తరలివచ్చి బినామీ పేర్లతో టెంట్లు రిసార్ట్స్ లు నిర్వహిస్తూ గిరిజన నిరుద్యోగ యువత ఆదాయానికి గండి కొడుతున్నారు. బినామీదారులకు పంచాయతీ నుంచి విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం కూడా దారుణమనిస్థానికుల అభిప్రాయపడుతున్నారు. మండలంలోని మాడగడ పంచాయతీ బోసుబేడ గ్రామ సమీపంలో బినామీ పేరుతో మైదాన ప్రాంతానికి చెందిన ఓ గిరిజనేతరుడు 30 రిసార్ట్స్‌లతో పాటు, మరో 50 పెద్ద టెంట్లు ఏర్పాటు చేశారు. అలాగే వీటిలో రెస్టారెంట్ సౌకర్యంతోపాటు రైన్ డాన్స్, వేదిక కూడా ఏర్పాటు చేశారు. మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్‌కు వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పెద్ద మొత్తంలో పెద్ద ఊరును తలపించేలా ఈ రిసార్ట్స్ టెంట్లు ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతంలో టెంట్లు నిర్వహించుకుని ఉపాధి పొందే నిరుద్యోగ యువత ఆది పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డబ్బులున్న గిరిజన నేతలకు పరిమితం లేకుండా టెంట్లు, రిసార్ట్స్ నిర్వహణకు మాడగడ పంచాయతీ కార్యదర్శి అనుమతి ఇవ్వడంతో వీరి నిర్మాణానికి అడ్డు అదుపు లేకుండా పోయింది. దారి పొడవున ఇరువైపులా నిర్మించిన ఈ రిసార్ట్స్ రెండు మూడు రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం కావడంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడుతుందని ఆ ప్రాంతంలో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఈ రిసార్ట్స్ నిర్మాణ పరిమితులు తగ్గించి, అందరూ ఉపాధి పొందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. నిజమైన గిరిజనులకు ప్రయోజనం చేకూర్చేందుకు బినామీల జోక్యాన్ని పూర్తిగా నివారించాలని కోరుతున్నారు. ఒక్క మాడగడ వ్యూపాయింట్ దగ్గరలోని రిసార్ట్స్ ఉండడంతో ఇక్కడి నిర్వాహకులు ఒక్కరే లబ్ధి పొందే ఉందని భావిస్తున్నారు.

రిసార్ట్స్ నిర్మాణం కోసం కప్పేస్తున్న మంచినీటి బావి

రిసార్ట్స్ కోసం మంచినీటి బావి పూడ్చివేత

అరుకు మౌంట్ వ్యూ క్యాంపింగ్ రిసార్ట్స్ పేరుతో నిర్మిస్తున్న ఈ ప్రాంగణంలో బోసుబేడ గ్రామస్తులు తాగే మంచి నీరు బావి ఉండేది. అయితే పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వం నిర్మించిన మంచినీటి బావిని కూడా మూసేసి యథేచ్ఛగా టెంట్లు నిర్మించారని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందరికి ఉపయోగపడే మంచినీటి బావిని బినామీ నిర్మాణదారులు ఎలా మూసివేస్తారని ప్రశ్నిస్తున్నారు. రిసార్ట్స్ నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పర్యాటక కేంద్రంలో గిరిజనేతర బినామీదారులను ప్రోత్సహించవద్దని, 1/70 భూబదలాయింపు చట్టం పటిష్టంగా అమలు చేయాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి విచ్చలవిడిగా అనుమతులు ఇస్తుండడంపై మండిపడుతున్నారు. దీనివల్ల అసాంఘిక కార్యకలాపాలు పెచ్చరిల్లిపోయే ప్రమాదం ఉందని అభిప్రాయపడుతున్నారు.

పంచాయతీ కార్యదర్శి వివరణ

రిసార్ట్స్ నిర్మాణంపై పూర్తి వివరాలను తెలుసుకోవడానికి మాడగడ పంచాయతీ కార్యదర్శి భోగి రాజును ఫోన్లో సంప్రదించగా గుంజిడి సుబ్బారావు అనే గిరిజనుడి పేరు మీద పంచాయితీ తీర్మానం, గ్రామసభ ఆమోదం మేరకు ఒక లక్ష 42 వేల రూపాయలు చలానా కట్టించి అనుమతి ఇచ్చామని కార్యదర్శి తెలిపారు.

పర్యాటకుల విడిదికి ఏర్పాటు చేసిన టెంట్లు

బలిమెల జలాశయం నీటి నిల్వలపై సమీక్ష

సమీక్ష సమావేశంలో పాల్గొన్న ఇరు రాష్ట్రాధికారులు

ప్రజాశక్తి -సీలేరు: ఆంధ్రా, ఒడిశా ఉమ్మడి నిర్వహణలో ఉన్న బలిమెల జలాశయం నీటి నిల్వలు, వినియోగంపై ఇరు రాష్ట్ర అధికారులు బుధవారం చిత్రకొండ ఒపి హెచ్ పిసి కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. 2025- 26 సంవత్సరానికి సంబంధించి జూలై 2025 నుంచి నవంబరు 30 వరకు ఏ ఏ రాష్ట్రాలు ఎంతెంత టిఎంసిలు నీటిని వినియోగించుకున్నారో లెక్కలు తేల్చారు. ఆంధ్రా ఇప్పటివరకు తన వాటాగా 20.3513 నీటిని వినియోగించుకు న్నట్లు అలాగే ఒడిశా 2024- 25 సంవత్సరంలో వినియోగించుకున్న 4.8847 టిఎంసీలతో కలుపుకుని ఈ ఏడాది 2025- 26 నవంబరు చివరినాటికి 45.5667 టీఎంసీలు నీటిని వినియోగించుకున్నట్లు లెక్కలు తేల్చారు. దీని ప్రకారం ఒడిశా ఆంధ్రా కంటే 25.2154 టీఎంసీలు అధికంగా వినియోగించుకున్నట్లు నిర్ధారించా రు. ప్రస్తుతం బలిమెల జలాశయంలో 74.4000 టీఎంసీలు జ్యాలాపుట్లో 28.5451 టీఎంసీలు కలుపుకొని మొత్తం 106.9451 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నాయని ఈ నెలాఖరుకి బలిమెల జలాశయం ఉన్న ప్రాంతాల నుంచి 3.5000 టీఎంసీలు జ్యాలాపుట్‌కు 2.5000 టీఎంసీలు నదీ పరివాహ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతాయని అధికారులు అంచనా వేశారు. వీటితో కలుపుకొని రెండు జలాశయాల్లో మొత్తం 112.9451 టీఎంసీలు నీటి నిలువలు ఉన్నట్లు లెక్కలు కట్టారు. ఇందులో ఆంధ్ర వాటాగా 68.0803 టీఎంసీలు గాను ఒరిస్సా వాటా 43.8648 టీఎంసీలుగాను పంపకాలు జరిపారు. ప్రస్తుతం గ్రిడ్ డిమాండ్ ఇరిగేషన్ అధికారుల అవసరాల మేరకు ఆంధ్ర 2000 క్యూసెక్కులు ఒరిస్సా 3000 క్యూసెక్కులు నీటిని వినియోగించుకోవడానికి ఇరు రాష్ట్రాల మధ్య అంగీకారం కుదుర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఒడిశా తరపున పొట్టేరు ఇరిగేషన్ చీఫ్ కనస్ట్రక్షన్ ఇంజనీర్ కపాకుమార్‌పాత్రో, చిత్రకొండ ఎర్త్ డాం డివిజన్ ఎస్ఇ రమాకాంత పాత్రో, పొట్టేరు కెనాల్ డివిజన్ ఎస్ఇ సనోజ్‌సాహూ బలిమెల ఒపి హెచ్ పిసి మేనేజర్ బిమల టర్కీ, డిప్యూటీ మేనేజర్ చంద్రబెహరా ఎఇఇలు గడాదర్ ప్రధాన్ దిలీప్ కుమార్, కృష్ణ చంద్రపాణి, ఆంధ్రా తరపున సీలేరు కాంప్లెక్స్ ఓఅండ్ఎం ఎస్ఇ చిన్న కామేశ్వరరావు, ఇన్‌చార్జి ఇఇ క్యాంపు జైపాల్ ఎఇఇ సిహెచ్ సురేష్ పాల్గొన్నారు.

చెన్నుపాటి లక్ష్మయ్య సేవలు మరువలేనివి

- ఘనంగా చెన్నుపాటి వర్ధంతి

చెన్నుపాటికి నివాళులర్పిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: యుటిఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు చెన్నుపాటి లక్ష్మయ్య సేవలు మరువలేనివని యుటిఎఫ్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గొలగాని శ్రీను,కానెం శ్రీను అన్నారు. బుధవారం స్థానిక ఎంఆర్‌సి కార్యాలయం వద్ద చెన్నుపాటి వర్ధంతి యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. యుటిఎఫ్ నేతలు చెన్నుపాటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు గొలగని శ్రీను మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలన్నింటిని లక్ష్మయ్య ఒకేతాటిపైకి తెచ్చారన్నారు. జిల్లా పత్రిక కార్యదర్శి తీగల బొజ్జియ్య మాట్లాడుతూ 1944లో నర్సరావుపేట తాలూకా బోర్డు ఉపాధ్యాయ సంఘాన్ని పునర్నిర్మించి దాని నాయకత్వాన్ని స్వీకరించారని, 1946 లో రాష్ట్రస్థాయిలో వివిధ సంఘాల కార్యకర్తల సంయుక్త సమావేశం గుంటూరులో ఏర్పాటు చేశారని, ఆ సమావేశంలోనే ప్రాథమికోపాధ్యాయులందరినీ ఒకే సంఘంగా ఏర్పాటు చేయాలనే నిర్ణయం జరిగిందన్నారు. జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ 1947లో ఆంధ్ర ప్రాథమికోపాధ్యాయ ఫెడరేషన్ అవతరించిందని దీనికి లక్ష్మయ్య అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డా రన్నారు. కార్యక్రమంలో సహాధ్యక్షులు జంపా రాంబాబు, మహిళా కార్యదర్శి లక్ష్మీ ప్రసన్న, మండల కార్యదర్శులు నీలాద్రి రాజుబాబు,చెన్నంశెట్టి చిట్టిబాబు, సుబ్బారావు, అబ్బాయిరెడ్డి,పూసం సత్తిబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పులి సంతోష్‌కుమార్

21న అమరవీరుల సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - విఆర్‌పురం: ఈ నెల 21న చింతూరులో జరిగే అమరవీరుల సంస్మరణ సభను జయప్రదం చేయాలని సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం చొక్కనపల్లిలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం చాలామంది ప్రజానాయకులు ఉద్యమాలు నడుపుతూ అమరులయ్యారని వారిని స్మరించుకుంటూ జరుపుకునే ఈ సభలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ మండల నాయకులు పంకు సత్తిబాబు, తోడం రాజు నాయకులు, కార్యకర్తలు గొంది ధారయ్య, పెట్ట ఏసుబాబు, సున్నం సీతమ్మ, తోడం చిన్న బూబమ్మ తెల్లం రాములమ్మ, తోడం గాలి దేవుడు అమరావతి, వెంకమ్మ, సోడి శ్రీను, పులి నాగేశ్వరరావు, తోడం అనిల్, వెంకటేష్, సున్నం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బోర్‌కు శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ నాగమణి

హ్యాండ్ బోర్‌కు శంకుస్థాపన

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని పెద్దార్కూరు పంచాయతీ పరిధి రేపాకలో తాగునీటి కోసం హ్యాండ్ బోర్ కోసం బుధవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ నాగమణి మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో ఫస్ట్ వార్నింగ్ లెవెల్ కి ఈ ప్రాంతంలో కరెంటు సౌకర్యం లేకపోవడం వలన ఇక్కడి ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని, హ్యాండ్ బోర్ వేయడం వల్ల సమస్య తీరుతుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడకం బోజ్జి, స్థానిక వార్డు మెంబర్లు, పార్టీ మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మడకం జోగయ్య, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీల ఎన్నిక

ప్రమాణం చేస్తున్న యుటిఎఫ్ నూతన కార్యవర్గం

అరకులో ఎన్నికైన యుటిఎఫ్ కార్యవర్గం

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు, పరిశీలకులు ఎస్ కన్నయ్య, జిల్లా కార్యదర్శి సమక్షంలో మండల కౌన్సిల్ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. మొదట చెన్నుపాటి లక్ష్మయ్య వర్ధంతి సందర్భంగా ఆయన ఆశయాలను , త్యాగాలను గుర్తు చేసుకుంటూ, సంతాపం ప్రకటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం నూతన మండల కార్యవర్గం ఎన్నికల నిర్వహించారు. కార్యక్రమంలో సభ్యులు కాపురేడు సీతమ్మ మాస్టారు కార్యవర్గం ప్రతిపాదిస్తే ప్రసాద్ మాస్టారు బలపర చగా, గౌరవ అధ్యక్షులు చెడ్డ జయరాం, అధ్యక్షులుగా ఎస్ బాలకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా కాకలి రాజా రావు, కోశాధికారి గుజ్జల దుక్కు, కార్యదర్శులుగా బి శ్రావణ్ కుమార్ ,జే రాజ్ కుమార్, జే పద్మనాభం ,సిహెచ్ ఆనంద్ , పి సీతన్న, ఎం మోహన్‌లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు.

అరకులోయ రూరల్: యుటిఎఫ్ అరకులోయ మండల కమిటీ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. అరకులోయ మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో కౌన్సిల్ సమావేశంలో నూతన మండల కమిటీ గౌరవ అధ్యక్షుడుగా ఎస్ దుక్కునాయుడు,(పధాన కార్యదర్శి గా ఏ లచ్చన్న, అసోసియేట్ అధ్యక్షుడుగా ఎస్ రాంబాబు, ఉపాధ్యక్షులుగా డి రాజుబాబు, ఎం పార్వతి, కోశాధికారిగా స్వామి, సహాయ కార్యదర్శులుగా ఎస్ నారాయణ, ఎల్.బి కుమారి, పి శాంతికుమారి, ఎల్ నాగమ్మ, వి శాంతికుమారి, బి శ్యామల,జి సింహాద్రి నాయుడు, ఎస్ రామచందర్, ఎడిట్ కమిటీ సభ్యుడుగా ఎల్బి కామేష్, జిల్లా కౌన్సిలర్లుగా టి చిట్టిబాబు, ఆర్ ఎరుకులు, యు.గంగరాజు ఏకగ్రీవమయ్యారు.

విద్యా సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆందోళన

వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి- పాడేరు : ఏజెన్సీ 11 మండలాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలంటూ అల్లూరి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం తలారిసింగి జంక్షన్ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అల్లూరు జిల్లా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను, జీవన్‌కృష్ణ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ హాస్టల్‌లో హెల్త్ వాలంటీర్లు, వాచ్‌మెన్‌లను నియమించాలని కోరారు. విద్యార్థులు మరణాలను వెంటనే అరికట్టాలని, ఖాళీగా ఉన్న లెక్చరర్, ఉపాధ్యాయులు, ఇతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. . ప్రమోట్ ఫీజు, ట్యూషన్ ఫీజు పేరుతో గిరిజన విద్యార్థులను మోసం చేయవద్దని డిమాండ్ చేశారు. ఏజెన్సీ 11 మండలాల్లో ఎస్ఎఫ్ఐ నిర్వహించిన సర్వేలో విద్యార్థులు గజ్జి దురద తామర వంటి వ్యాధులతో బాధపడుతున్నారన్నారు. శీతాకాలంలో స్వెట్టర్లు, వేడినీరు ఇవ్వాలన్నారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి, పాడేరు, తలారసింగి, మాడుగుల పాఠశాలల శిథిల భవనాల మరమ్మతులు, కొత్త భవనాలను నిర్మించి మౌలిక సదుపాయాలను కల్పించాలి కోరారు. ప్రభుత్వం కార్పొరేట్ స్థాయిలో డిగ్రీ,ఇంటర్ విద్యార్థులకు ఫీజులు పెంచేయడం వలన విద్యార్థులు చదువుకు దూరమై, అనేకమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పీజీ విద్యార్థులకు జిఒ 77 రద్దుచేసి పీజీ విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట ఇవ్వాలని కోరారు. ఐటిడిఎ అధికారులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో అల్లూరి ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు చిన్నారావు, సింహాద్రి, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు పాపారావు, గోపాల్, ఎస్ఎఫ్ఐ మండల కమిటీ సభ్యులు చందు,అనిల్ పాల్గొన్నారు.

15న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి దుంబ్రిగుడ: రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 15న మండలంలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు స్థానిక మండల తహసిల్దార్ త్రివేణి తెలిపారు ఈ రక్తదాన శిబిరాన్ని ఐటిడిఏ పిఓ తిరుమణి శ్రీపూజ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని తెలిపారు. ఉద్యోగులు, గిరిజనులు, ప్రజాసంఘాల నాయకులు, పాత్రికేయులు, యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని కోరారు కార్యక్రమంలో హెచ్‌డిటి చంద్రశేఖర్,ఆర్ఐ బిపియం రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: సీతమ్మధార అల్లూరి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం అరకువేలి మండలం బొండం పంచాయతీ బలియగూడ, కరకవలస గిరిజన గ్రామాల్లో దుప్పట్లు పంపిణీ చేశారు.ఏజెన్సీ ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతూ, చలి పెరుగుతున్న నేపథ్యంలో ఆదివాసీలు పడుతున్న ఇబ్బందులు గమనించి, వారికి ఉపశమనంగా రూ.50వేలు విలువ చేసే 100 చలి దుప్పట్లు పంపిణీ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. అల్లూరి వాకర్స్ అసోసియేషన్ నాయకుడు ప్రభాకరరావు, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర చేతుల మీదుగా దుప్పట్ల పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా దుప్పట్లు అందించిన ౕప అల్లూరి వాకర్స్ అసోసియేషన్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి జి. బుజ్జిబాబు, మండల నాయకులు కె. రామారావు, పంచాయతీ నాయకులు టి.జోషి, కె.వెంకట్ పాల్గొన్నారు .

దుప్పట్లు పంపిణీ చేస్తున్న సురేంద్ర, తదితరులు

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

12న కలెక్టరేట్ వద్ద ధర్నాను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- చింతూరు: అంగన్‌వాడీలకు వేతనాల పెంపు తదితర సమస్యలపై ఈ నెల 12న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని దీనిని జయప్రదం చేయాలని సిఐటియు మండల కన్వీనర్ పొడియం లక్ష్మణ్ తెలిపారు. బుధవారం సిఐటియు ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదు 2024లో సమ్మె చేస్తున్న అంగన్‌వాడీల వద్దకు వచ్చిన ప్రస్తుత కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారని, ఇతర సమస్యలు పరిష్కరిస్తామని మినిట్స్ ఇచ్చారు. అయితే అధికారంలోకి వచ్చి ఇప్పటివరకూ ఎటువంటి ఫలితం లేదు. అంగన్వాడీ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలి. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి. అన్ని యాప్ లు కలిపి ఒక యాప్‌గా మార్చాలి. తదితర డిమాండ్లతో ఈ నెల 12న చింతూరు ఐటిడిఎ వద్ద ధర్నా నిర్వహిస్తున్నామని అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు , ఆయాలు అంతా ధర్నాకు వచ్చి జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో మండల కో కన్వీనర్ కారం సుబ్బారావు, నాయకులు కుంజా శ్రీను, ధర్మల వీరభద్రం. ముర్రం భద్రయ్య. తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభ

ప్రజాశక్తి - వై.రామవరం: సమస్యల పరిష్కారానికే గ్రామసభ నిర్వహిస్తున్నట్టు ఎంపిడిఒ బాపన్నదొర అన్నారు. వై.రామవరం అప్పర్ పార్టీ గుర్తేడు మండలం బోడగండి పంచాయతీ డొంకరాయిలో నిర్వహించిన గ్రామసభకు ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ బాపన్నదొర హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రామసభలో బుధవారం ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నదీ లేనిదీ, ఇతరమాలిక సదుపాయాలు అందుతున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. పలు సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెద్దార్కూర్ యూనిట్‌గా పునరావాస ప్యాకేజీ ఇవ్వాలి

ప్రజాశక్తి - కూనవరం: మండలంలోని పెద్దఆర్కూర్ గ్రామంలో సిపిఎం ముఖ్య కార్యకర్తల సమావేశం పాయం వెంకటయ్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పొడియం రామారావు మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు పేరుతో గిరిజనులను నిండా ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంటూరు పేరుతో ముంపు గ్రామాలని విభజించి తప్పుడు లెక్కలు కడుతున్నారన్నారు.పోలవరం ప్రాజెక్ట్ 41.5 కాంటూర్‌కి 2022లో పోలవరం ప్రాజెక్ట్ వద్ద 37 మీటర్లు నీరు నిల్వ ఉంచితే బ్యాక్‌వాటర్ వలన కూనవరం మండలంలో 48 గ్రామాలు నీటమునిగాయన్నారు. కానీ అధికారులు మండలంలోని 41.5 కాంటూరు 9గ్రామాలు గుర్తించి అధికారులు చేతులు దులుపుకున్నారన్నారు. పెద్దఆర్కూర్ గ్రామాన్ని ప్రయారీటి గ్రామంగా గుర్తించారని కాని గ్రామంలో కొన్ని ఇళ్లను మాత్రమే తీసుకోవడం దారుణమని అలా కాకుండా గ్రామాన్ని మొత్తం ఒక యూనిట్ గా తీసుకుని నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరావు, మడకం నాగమణి, పార్టీ ఎక్స్ ఎంపిటిసి పాయం సత్యనారాయణ, స్థానిక పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్వానంగా ఆశ్రమ పాఠశాల పరిసరాలు

రోడ్డుపై నిలిచిపోయిన గంజి

ప్రజాశక్తి - జికెవీధి : మండలంలోని రింతాడ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో వంట చేసినప్పుడు బియ్యం కడిగిన నీరు, అన్నం వార్చిన తరువాత గంజి మొత్తం రోడ్డుపైకి వదిలేస్తున్నారు. అది మురిగిపోయి కంపు కొడుతోంది. పాఠశాలకు చెందిన విద్యార్థులు కూడా పక్కనే భోజనాలు చేస్తారు. ఈగలు ఎక్కువగా ఉండడం వల్ల వారి ఆరోగ్యం పాడైతే ఎవరు బాధ్యులని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరారు.

ధర్మను సత్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఘనంగా వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి-యంత్రాంగం

పాడేరు: వికలాంగులను ఏ విషయంలోనైనా చిన్నచూపు చూడరాదని, అంతర్జాతీయ జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ తెలిపారు. బుధవారం పాడేరు కాఫీ హౌస్‌లో విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో విభిన్న ప్రతిభావంతులకు నిర్దేశించిన ఉద్యోగాలను అన్ని డిపార్ట్మెంట్ నుండి వెరిఫికేషన్ కొరకు రాష్ట్ర ప్రభుత్వానికి పంపి అనుమతులు పొంది పోస్టులు వారీగా నోటిఫికేషన్ విడుదల చేయవలసిందిగా ఆదేశించామన్నారు. స్వయం ఉపాధి పథకాల ద్వారా వారికి ప్రభుత్వం నుండి రాయితీతో కూడిన రుణాలను మంజూరు చేయాలని కోరారు. పెన్షన్ తీసుకున్న వారి సమాచారంతో పాటు జిల్లాలో మొత్తం వికలాంగుల వివరాలు సేకరించాలని అధికారులకు తెలిపారు. ఈసందర్భంగా వికలాంగులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ ఐటిడిఎ పిఒ తిరుమణి శ్రీపూజ, అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్, జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె. కవిత, రెడ్ క్రాస్ ప్రతినిధులు జయ మరియు జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి యూసిఫ్‌రామ్ పడాల్ పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పాడేరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికలాంగుల సంక్షేమానికి కృషి చేస్తున్న . ట్రైబల్ డిజేబుల్ హెల్పర్ సొసైటీ అధ్యక్షుడు బివి. ధర్మను జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్, ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి తిరుమణి శ్రీపూజ సత్కరించి, మెమొంటలో అందజేశారు. వికలాంగుల కోసం ప్రత్యేక పథకాలను అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ, సిఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సన్మానగ్రహీత ధర్మ మాట్లాడుతూ, ఏజెన్సీ ప్రాంతంలో వికలాంగుల సమస్యలను పరిష్కరించేందుకు తమ సంస్థ సేవలు నిరంతరం కొనసాగుతాయన్నారు.

మోడల్ మండలంగా అరకులోయ

ప్రజాశక్తి- అరకులోయ: పేజ్ 2, 3 క్రింద అరకు వేలీని మోడల్ మండలంగా ఎంపిక చేశారు. ఇందులో భాగంగా ఆర్థికంగా సామజికంగా గ్రామాభివృద్ధి లక్ష్యంగా గ్రామ, మండల సమాఖ్యలో ఇసి సభ్యులకు, విఒఎలు, సిసిలు, ఒబిలకు స్థానిక వెలుగు కార్యాలయంలో రెండోరోజు శిక్షణా నిర్వహించారు. శిక్షణలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కనక రావు, డిపియం ఐబీ, లైలియూడ్ మేనేజర్ ప్రభాకరరావు, ఎపిఎం కృష్ణారావు, ఎల్‌సి దాసు, సిసి లు ఆనంద్, మంగళన్న, అప్పలరాజు ఈశ్వర్, విఒఎలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కనకరావు

గిరిజన పంట ఉత్పత్తులపై ప్రణాళిక

ఎఫ్‌పిఒలతో సమీక్షలో జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : పాడేరు ఏజెన్సీ గిరిజన ప్రాంతంలో పండే పంటలపై ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్ సూచించారు. గిరిజన ఉత్పత్తులతో పోషకాలతో పాటు వ్యాధి నిరోధక శక్తి ఉంటుందన్నారు. బుధవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు డివిజన్ ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్లతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ ఏజెన్సీ గిరిజన ప్రాంతం అరకు కాఫీ పంటకు అంతర్జాతీయ స్థాయిలో పేరు ఉందని, అలాగే మిరియాలు, పసుపు పంటలకు కూడా మంచి పేరుందని తెలిపారు. ప్రతినెలా ఎఫ్‌పిఒలకు అక్కడ పండే పంటలపై శిక్షణ డివిజనల్ వారీగా ఇచ్చే విధంగా చూడాలని, ఉత్పత్తులపై సరైన అవగాహన కల్పించి, ఆదర్శ రైతులకు వీలైనంత ఎక్కువ మంది గ్రూపులలో సభ్యులను చేర్చుకొని రైతులకు పండించే పంటలు ఎఫ్‌పిఒల ద్వారా కొనుగోలు చేయాలన్నారు. రైతుల పంటలను దళారులకు ఇవ్వకుండా ఎఫ్‌పిఒ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. ఏ ప్రాంతంలో ఏ పంటలు ఉత్పత్తి ఎక్కువగా అవుతుందో వాటికి తగినట్లుగా రైతులకు వాటి ధరలపై తెలియజేయాలన్నారు. కాఫీ, మిరియాలకు గ్రేడింగ్ ప్రాసెసింగ్ యూనిట్లు లాగే పసుపు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసే విధంగా ప్రోత్సహించాలని, ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించిన సబ్సిడీలు పై రైతులకు వివరించాలని తెలిపారు. రైతులకు కావలసిన పనిముట్లు ప్రోసెసింగ్ యూనిట్లకు సంబంధించిన వాటిపై బ్యాంకు రుణాల ద్వారా

సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

రుణాలు అందే విధంగా చూడాలన్నారు. పసుపు గ్రేడింగ్, ప్రాసెసింగ్ చేసి విక్రయించినట్లయితే మంచి లాభాలు ఉంటాయని తెలిపారు. జిల్లాలో ఏఏ డివిజన్లో ఎన్ని ప్రాసెసింగ్ యూనిట్లు ఉన్నాయో వాటిపై సమగ్ర నివేదికను వాటిపై సమగ్ర నివేదిక అందించాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా హార్టికల్చర్ అధికారి కె బాల కర్ణ, ఐటిడిఎ ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి రాజేష్, సతీష్, పాడేరు డివిజనల్ ఎఫ్‌పిఒలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

ప్రజాశక్తి- ముంచింగిపుట్టు :బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత కావాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి తాంగుల సద్దు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బాల్య వివాహాల నిర్మూలనకు 100 రోజుల జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా సిడిపిఒ యు విమలకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో తాంగుల సద్దు మాట్లాడుతూ, మన్యంలోని ఆదివాసీ ఆడబిడ్డలకు బాల్య వివాహాలు చేస్తుండడంతో వారి భవిష్యత్ విచ్ఛిన్నమౌతోందన్నారు. 18ఏళ్లలోపు బాలికలను వేధిస్తే ఫోక్సో చట్టం కింద కేసు నమోదై రెండేళ్ల వరకు జైలు, రూ.రెండు లక్షల జరిమానా విధించే అవకాశం ఉందన్నారు. బాల్యవివాహాల రహిత ఆంధ్రప్రదేశ్ లక్ష్యమన్నారు సిడిపిఒ విమల కుమారి మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్యంలోనే పెళ్లిళ్లతో చదువు అర్థాంతరంగా ఆగిపోవడంతోపాటు, చిన్నతనంలోనే గర్భధారణతో రక్తహీనతకు గురై అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు అందరు సహకరించాలని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అవుట్ రీచ్ వర్కర్ ఎస్ కనకలక్ష్మి, హెడ్ కానిస్టేబుల్ రాము, ఎపిఎం. సిహెచ్ కళావతి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు సిహెచ్ వరహాలమ్మ, ఎస్ రాజేశ్వరి, బ్లాక్ కోఆర్డినేటర్ సురేష్, సచివాలయ మహిళా పోలీస్ భార్గవి శైలజ, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ కెకె.దొర, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

సిసి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి -జి.మాడుగుల మండలంలోని సొలభం పంచాయతీ, వంజంగిపాడు గ్రామంలో పీసా ఉపాధ్యక్షులు లకే రామకృష్ణ చొరవతో మంజూరైన సిసి రోడ్డు నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. రూ.20, లక్షల ఉపాధి నిధులతో ఈ రోడ్డు నిర్మించనున్నారు. సోలభం పంచాయతీ సర్పంచ్ ఐసరం హనుమంతరావు, మాజీ ఎంపీపీ గంగరాజు(బుజ్జి), టీడీపీ సీనియర్ నాయకులు మత్స్యరాస రామరాజు, పంచాయతీ రాజ్ జెఇ మాణిక్యం, పంచాయతీ ఇంజినీరింగ్ అసిస్టెంట్ గోపాల్, గోవర్ధన్ టీడీపీ నాయకులు మాధుల బాలకృష్ణ, వంజంగి పాడు గ్రామ పెద్ద లకే అబ్బాయి దొర, మంగళి దొర, తెల్లన్న దొర రాజాం దొర రామలింగం, మత్యకొండబాబు గ్రామస్తులు పాల్గొన్నారు

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ తదితరులు

నేరాలు ఘోరాలు

ఆటో బోల్తా : తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని అనంతగిరి, బోడగుడ కాఫీ తోటల మలుపు సమీపంలో బుధవారం ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు ఎటువంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. బోడగూడ గ్రామం నుండి అనంతగిరి మండల కేంద్రంలో వెళ్తున్న సమయంలో మలుపు తిరుగుతూ లోయలోకి దూసుకు వెళ్ళింది ఈ ప్రమాదంలో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆటో ముందు భాగం నుజ్జునుజ్జయ్యింది.

లోయలోకి దూసుకెళ్లిన ఆటో

కాఫీ కొనుగోలుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

ప్రజాశక్తి-పాడేరు : జిల్లాలో కాఫీ పండ్లు, లేదా చెర్రీ కాఫీ కొనుగోలు చేసే ట్రేడర్స్, ఎఫ్‌పిఒలు, ఎన్‌జిఒలు వివిధ కంపెనీల మధ్యవర్తులు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తప్పనిసరి పొందాలని జిల్లా కలెక్టరు ఏ ఎస్ దినేష్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ నెల 17లోగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నుండి కాఫీ ట్రేడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ను పొందాలని సూచించారు. ఈ సర్టిఫికెట్ నిర్ణీత గడువులోపు దరఖాస్తు చేసుకుని పొందని వారు, తరువాత అపరాధ రుసుము చెల్లించి పొందవలసి ఉంటుందన్నారు. అనధికారంగా కొనుగోలు చేసే వారు చట్టరీత్యా శిక్షార్హులని, కాఫీ కొనుగోలు వ్యాపారస్తులు అందరూ సర్టిఫైడ్ పొంది ఉండాలన్నారు. కాఫీ ట్రేడ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను పొందాలనుకున్నవారు 6303611454 ఫోన్ నెంబర్ కు సంప్రదించవలసినదిగా కోరారు.

తరగతి గదిలో విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ చెల్లయ్య

వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలి

ప్రజాశక్తి- కాశీపట్నం: అనంతగిరి మండల కేంద్రంలోశ్రీతీ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల-2ను ఎంఇఒలు కె బాలాజి, బిబి నాగేశ్వరరావులతో అల్లూరి జిల్లా ఉప విద్యాశాజీవధికారి సోమేలి చెల్లయ్య సందర్శించారు. పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.పాఠశాల ఉపాధ్యాయుల హ్యాండ్ బుక్స్, విద్యార్థుల అసెస్మెంట్ బుక్స్ ,వర్క్ బుక్స్ పరిశీలించారు. జిఎఫ్ఎల్ఎన్, తరల్‌తోపాటు పదవ తరగతి విద్యార్థులకు వందరోజుల కార్యచరణను అమలు చేయాలని హెచ్ఎం బి మంగమ్మ, పాఠశాల సిబ్బందికి సూచించారు. నూతనంగా విధులలో చేరిన ఉపాధ్యాయులను తరల్ ఎఫ్ఎల్ ఎన్ మీద శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘాల నాయకులు శెట్టి రాంబాబు, నరాజి మల్లేశ్వరరావు, డుంబరి సన్యాసిరావు, ఎల్బీ మంజునాథ్, రొబ్బా రామకృష్ణ, సలుబు దేవుడు, వంతల భాస్కరరావు, సిఆర్పిలు కించాయి రామకృష్ణ, ,జోగి రవి కుమార్ మండల విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది సుర్ల అచ్చిబాబు, బోనంగి సత్యనారాయణ పడాల్, కమిడి రఘు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

వందేమాతరం గేయం ఆవశ్యకతపై ర్యాలీ

ప్రజాశక్తి -సీలేరు: వందేమాతరం గేయాన్ని రచించిన 150 సంవత్సరాల అయిన సందర్భంగా త్రివర్ణ పతాకం ఆవశ్యకత తెలుపుతూ జీకే వీధి మండలం సీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రిన్సిపాల్ శంకరరావు, అధ్యాపకులు దుప్పిలివాడ పంచాయతీ బూసికొండలో బుధవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపల్ శంకరరావు మాట్లాడుతూ వందేమాతరం గేయాన్ని రచించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా దత్తతి గ్రామంలో ర్యాలీ నిర్వహించామని పేర్కొన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ వారిని ఏ విధంగా మన దేశ నాయ కులు గడగడలాడించారో వివరించామన్నారు. అనంతరం వందేమాతరం గీతాన్ని ఆలపించామన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామింగ్ అధికారి కామర్స్ లెక్చరర్ శ్రీనివాస్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం

ప్రాథమిక హక్కులతోనే మానవ మనుగడ

ప్రజాశక్తి-చింతూరు: ప్రాథమిక హక్కులతోనే మానవ మనుగడ సాధ్యమవుతుం దని, మనిషి స్వతంత్ర్యంగా జీవనం సాగించడానికి మానవ హక్కులు ఊతమిస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నమాణిక్యం అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రిన్సిపాల్ రత్న మాణిక్యం విచ్చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో 1948 డిసెంబర్ 10 న ప్రపంచ దేశాలన్నీ ఓ ఒప్పందంపై సంతకం చేసినప్పటి నుండి డిసెంబర్ 10న అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. రాజనీతి శాస్త్ర విభాగాధిపతి అప్పనమ్మ, డాక్టర్ వై.పద్మ, తదితర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

భర్తపై గొడ్డలితో దాడి చేసి హత్య

ప్రజాశక్తి-చింతపల్లి : మండలం లోని మేడూరు గ్రామంలో భార్యాభర్తల మధ్య ఫోన్ విషయమై తరచూ జరుగుతున్న వాగ్వివాదం చివరకు హత్యకు దారి తీసింది. భర్త రాజారావు (45) నిద్రలో ఉండగా భార్య దేవి గొడ్డలితో దాడి చేయడంతో రాజారావు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే రాజారావును చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కి తరలించారు. మంగళవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ రాజారావు మృతి చెందాడు. కుమార్తె మల్లేశ్వరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దేవిపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. వీరికి ముగ్గురు చిన్నారులు ఉన్నారు.

మృతుడు రాజారావు

ముమ్మరంగా వాహన తనిఖీలు

రింతాడలో వాహన తనిఖీలు చేస్తున్న ఎస్ఐ సురేష్‌కుమార్

జికె వీధి మండలం సీలేరులో వాహన తనిఖీలు

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరులో బుధవారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఐటిఐ జంక్షన్ వద్ద ఎస్సై యాసీన్ ఆధ్వర్యంలో సిఆర్‌పిఎఫ్ పోలీసు బలగాలను మోహరించి వాహన తనిఖీలు నిర్వహించారు. వ్యక్తులు వివరాల సేకరించి విడిచిపెట్టారు. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు నుంచి వచ్చి పోయే వాహనాలు తనిఖీ చేశారు. సీలేరు పరిసర ప్రాంతాల్లో మావోయిస్టు కదిలికలపై నిఘా పెట్టారు. మరోపక్క గంజాయి అక్రమ రవాణాకు సహకరిస్తున్న వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించారు. రాజస్థాన్, బంగ్లాదేశ్ నుంచి వివిధ వ్యాపారాల నిమిత్తం సీలేరు పోలీస్‌స్టేషన్ పరిధిలో బైకులు చోరీకి గురవుతున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. దీంతో ఎస్సై అప్రమత్తమై తనిఖీలు మరింత కట్టుదిట్టం చేశారు.

జీకే వీధి: మండలంలోని రింతాడ జంక్షన్ లో సబ్ ఇన్స్పెక్టర్ సురేష్‌కుమార్ వాహనాలు తనిఖీ చేశారు. తరచూ వాహన ప్రమాదాలు జరగడంతో వాహన చోదకుల వద్ద సరైన రికార్డులు లేకపోవడం గమనించి ప్రతి వాహనదారుడు కచ్చితంగా హెల్మెట్,లైసెన్స్, ఆర్‌సి, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

భూగర్భ జలవనరులను పరిరక్షించాలి

రైతులు, ప్రజలతో చర్చాగోష్టిలో కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు :ఇంకుడుగుంతలు, చెరువులు నిర్మాణంతో భూగర్భ జలాలను పెంపొందించి, భావితరాలకు నీటి వనరులు అందించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హైదరాబాద్ కేంద్ర భూగర్భజలమండలి దక్షిణ క్షేత్రం, విశాఖలోని రాష్ట్ర విభాగ కార్యాలయం సంయుక్త ఆధ్వర్యాన రైతులు, ప్రజలతో చర్చాగోష్టిని జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. అల్లూరి జిల్లాలో భూగర్భజలాల అభివృద్ధి, ,జల యాజమాన్య వనరుల మ్యాపింగ్, నిర్వహణపై ప్రత్యేక దృష్టి కార్యక్రమంలో మాట్లాడుతూ జిల్లాలో వర్షపాతం నమోదు, భూగర్భజలాలు అధికంగా ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకోలేకపోతున్నామన్నారు. దానిని అధిగమించి జిల్లాలోని గ్రామాలకు తాగునీరు, సాగునీరు అందించేలా జిల్లా భూగర్భజల వనరుల శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా శాఖల సమన్వయంతో పనిచేస్తున్నామన్నారు. తూర్పు కనుమల్లోని భూగర్భ జలవనరులు ఉత్తరాంధ్రలో కొన్ని లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు తాగునీరు అందిస్తున్నా యని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నిర్లక్ష్యం చేస్తే ఆయా ప్రాంతాల్లో భూములన్నీ బీడు భూములుగా మారే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలోని 22 మండలాల్లో వర్షపాతం లోటు లేకున్నా, నీటి నిల్వ, నీటి నాణ్యత, భవిష్యత్తులో ఎలా కాపాడు కోవాలనే దానిపై జిల్లా యంత్రాంగం ప్రణాళికలు రచిస్తుందన్నారు. జిల్లాలో గోదావరి, ఏలేరు, తాండవ శారద, గోస్థని మొదలగు నదులు ప్రవహిస్తున్నాయని వాటి ద్వారా నీటి నిల్వ సామర్థ్యం పెంచుతున్నామన్నారు. భూగర్భంలో నైట్రైట్, ఫ్లోరైడ్ నియంత్రణలోనే ఉన్నాయన్నారు. జిల్లాలో ఏటా రెండు మూడు పంటలు పండించేలా వ్యవసాయ బోర్లను ఏర్పాటు చేసుకోవాలని తద్వారా భూగర్భల వనరులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నీటి యజమాన్య సంస్థ ద్వారా జిల్లాలో నీటి నిల్వకు 254 చెక్‌డ్యామ్‌లను నిర్మించామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా నీటి కుంటలను, పంట కుంటలను తవ్వించడం జరుగుతుందన్నారు. సహజ వనరుల పరిరక్షణ, మానవ నిర్మిత నిర్మాణాల సంరక్షణద్వారా అధిక భూగర్భజలాలను పెంపొం

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

దించే చర్యలను జిల్లా యంత్రాంగం చేపడుతోందన్నారు. పూర్వీకులు ప్రకృతి ఆరాధన ద్వారా నీటి వనరుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చన్నారు. గ్రామసభల తీర్మానాల ద్వారా నీటి వనరులను కాపాడాలన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్, రీజినల్ డైరెక్టర్ ఎం.జ్యోతికుమార్ మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం లేని ప్రాంతంలో జీవించడం అల్లూరి మన్యవాసుల అదృష్టమన్నారు. సైంటిఫిక్‌గా పుస్తక రూపంలో ఉన్న సమాచారాన్ని ప్రాక్టికల్‌గా దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో కార్యక్రమాలు జరిపిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 8 శాతం భూగర్భ జలాలను వాడుతున్నారన్నారు. వ్యవసాయానికి ఉపయోగించే బోర్లకు ఫ్లో మీటర్లను బిగించి మోతాదుకు మించి ఎంత వాడుతున్నారో పర్యవే క్షించాలన్నారు. అమెరికా ప్రతినిధి గోపాల్ మాట్లాడుతూ నీటి నిల్వకు 20 వరకు పద్ధతులు అందుబాటులో ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం సిజిడబ్ల్యుబి శాస్త్రవేత్త లక్ష్మీనారాయణ దామోదర్, పాడేరు సబ్ డివిజన్ ఎస్ఎంఐ డిఇఇ ఆర్ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్, డ్వామా అధికారులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

శాంసంగ్ 'గెలాక్సీ జెడ్ ట్రైఫోల్డ్ ' ఆవిష్కరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ 'గెలాక్సీ జెడ్ ట్రైఫోల్డ్' ను బుధవారం నగరంలోని శాంసంగ్ కార్యాలయంలో విడుదల చేశారు. మొబైల్ ఎఐ యుగంలో కొత్తరకం డిజైన్లలో శాంసంగ్ తన ఆధిపత్యాన్ని దీని ద్వారా మరింత విస్తరిస్తోందని శాంసంగ్ ఎలక్ట్రానిక్స్, డివైస్ ఎక్స్ పీరియన్స్ డివిజన్ ప్రెసిడెంట్, సిఇఒ టి.ఎంరోహ్ అన్నారు. ఫోల్డబుల్ విభాగంలో ఒక దశాబ్దపు ఆవిష్కరణల పునాదిపై గెలాక్సీ జెడ్ ట్రైఫోల్డ్‌ను నిర్మించారనచన్నారు. మల్టీ-ఫోల్డింగ్ డిజైన్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన అత్యంత అధునాతన ఫోల్డబుల్ టెక్నాలజీలతో, ఇది ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడు మృతి

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలం చిన్నగడ్డ మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న పల్లి వెంకటరమణయ్య (56) అనారోగ్యం తో బుధవారం మృతి చెందారు. కొయ్యూరు మండలం చిట్టెంపాడు పంచాయతీ పరిధిలోని రామన్నపాలెం గ్రామానికి చెందిన ఆయన కొంతకాలంగా ఆరోగ్యం బాగోలేక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆయన నివాస గృహంలో మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు వెల్లడించారు. ఉపాధ్యాయ వృత్తిలో నిష్ఠ, క్రమశిక్షణగా పనిచేసే వెంకటరమణయ్య మృతి పట్ల సహచర ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాల నాయకులు సంతాపం తెలిపారు.

వెంకటరమణయ్య

సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి

డిజిటల్ విద్యపై సెమినార్ ప్రారంభం

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ యం.విజయభారతి ఆధ్వర్యంలో పియం.ఉష స్కీమ్ సహకారంతో డిజిటల్ ఎడ్యుకేషన్-పాలసీ ఇంప్లికేషన్ ఇన్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ, ప్రాస్పెక్ట్స్, ఛాలెంజెస్" అన్న అంశంపై రెండురోజుల సెమినార్ బుధవారం ప్రారంభమైంది. వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ప్రొఫెసర్ శర్మ వివిఎస్ వేలూరి కీలకోపన్యాసం చేశారు. రిసోర్స్ పర్సన్స్‌గా జిడిసి నందికొట్కూరు కామర్స్ లెక్చరర్ డాక్టర్ పరిమళాదేవి, కర్నూలు కెవిఆర్ డిగ్రీ కళాశాల మాథమెటిక్స్ లెక్చరర్ డాక్టర్ టి.సునీత మాట్లాడారు. అల్లూరికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం తోలుబొమ్మలాట, విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, థింసా నృత్యాలతో కళాశాల ఆవరణ సందడి చేసింది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మినిమల శ్రీనివాస్ పాత్రుడు, పిఎం ఉష కోఆర్డినేటర్ డాక్టర్ వి.రమణ, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి గిరిబాబు

పంటల్లో అధిక దిగుబడిపై అవగాహన

ప్రజాశక్తి - జికెవీధి: మండలంలోని అసరాడలో జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా రాజ్మా క్లస్టర్ ప్రదర్శన నిర్వహించారు. దీనిలో భాగంగా రైతులకు రాజ్మా పంటలో అధిక దిగుబడి కోసం ఎలాంటి యాజమాన్య పద్ధతులు పాటించాలి, చీడపీడల నివారణ కోసం మండల వ్యవసాయాధికారి గిరిబాబు వివరించారు. అదేవిధంగా రైతులకు 90 శాతం రాయితీపై వేపనూనె కూడా పంపిణీ చేశారు.